www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 27 | సెప్టెంబర్ | 2026
పేజీలు : 8

## జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే



**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**-బైపాస్ రోడ్డులో సిపిఐ రాస్తారోకో**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల అభిప్రాయాలను పక్కదారి పట్టించిన జ్ఞానేష్‌కుమార్ దేశ ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు. బిజెపికి తొత్తుగా వ్యవహరించిన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని

మిగతా 2లో..

# రూపుదిద్దుకుంటున్న సరస్వతి క్షేత్రం



**-ఓ తరం భవితకు భరోసా**
**-శరవేగంగా యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం**
**-సాకారం దిశగా భట్టి కల**



విద్యా రంగంలో దూసుకుపోతున్న ప్రైవేటీకరణను నిలువరించడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల్లో పోటీకి నిలబడలేని పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యుత్తమ వసతుల కల్పన, శిక్షణ ద్వారా ఉత్తమ విద్యార్థులను తయారు చేసేందుకు రూపుదిద్దుకున్న ఆలోచనే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్. 2,500 మంది విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకు ఒకే చోట వసతి, విద్యా బోధన కల్పించడం ద్వారా ఓ తరం భవిష్యత్తుకు భరోసా ఇచ్చేవిధంగా వీటిని నిర్మిస్తున్నారు. కేవలం చదువు, వసతులే కాకుండా మనో వికాసానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఈ సరస్వతి క్షేత్రంలో ఉన్నాయి. రాష్ట్రంలో 119 నియోజక వర్గాల్లో నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా స్కూల్స్‌లో మధిర నియోజక వర్గంలోని లక్ష్మిపురం గ్రామంలో నిర్మితమవుతున్న ఈ క్షేత్రం మార్చి నాటికి పూర్తి కానుంది. విద్య ద్వారానే సమాజాభివృద్ధి అని నిరంతరం భావించే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చదువు ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మారతాయని చెబుతుండే వారు. పేదలకు ఉత్తమ వసతులు, విద్యా బోధన ఉంటే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని భావించిన ఆయన తన కలను సాకారం చేసుకునే దిశగా ఈ క్షేత్ర నిర్మాణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు.

2లో

-ప్రజాపక్షం/ఖమ్మం

## పర్యాటక భాండాగారం భద్రాద్రి




**- ప్రకృతి అందాలు ఆధ్యాత్మికత**
**ప్రత్యేక గిరిజన సంస్కృతి**
**- జలపాతాలు నదీ విహారాలు**
**- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రకృతి అందాలు ఆధ్యాత్మిక ప్రాధాన్యం గిరిజన సంస్కృతి దట్టమైన అడవులు నదులు జలపాతాలు చారిత్రక నేపథ్యం కలిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యాటరంగానికి అపారమైన అవకాశాలు కలిగుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థిక వ్యవస్థకు పర్యాటకం కీలక రంగంగా మారే అవకాశం ఉంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నేడు లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం బౌద్ధ గుహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**భద్రాచలం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం :** గోదావరి తీరంలో ఉన్న భద్రాచలం జిల్లాకు ప్రధాన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయానికి దేశవ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. రామాలయంతో ముడిపడిన ప్రాంతాలు గోదావరి నది కరకట్ట అలయ పరిసరాలు, పర్ణశాల గోదావరి పాపికొండలు, ప్రాంతాలు కలుపుతూ పర్యాటక సర్క్యూట్‌గా రూపొందించేందుకు అవకాశం ఉంది. పర్ణశాలలో రామాయణ ఇతి వృత్తాలు,

మిగతా 2లో..

## మోడీ పాలనను నిరసిస్తూ జైల్‌భరో




**-ధరల నియంత్రణలో విఫలం**
**-రేవంత్...**
**హామీలు అమలు చేయకపోతే ఆందోళన**
**-అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి**
**-సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మోడీ పాలనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విస్తృత పద్ధతుల్లో ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అక్టోబర్, నవంబర్ మాసాల్లో మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ డిసెంబర్ రెండు, మూడు, నాలుగు తేదీలలో జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు లక్షల మంది అరెస్టు కానున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం ఏనుగు గాంధీ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో బాగం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి అనుబంధ సంఘాలుగా మార్చివేశారని సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎన్నికల సంఘం సహా వివిధ సంస్థలు స్వతంత్రతను కోల్పోయాయన్నారు. బిజెపి పాలన ప్రజలకు వ్యతిరేకంగా సాగుతుందని ఆయన

మిగతా 2లో..

# రూపుదిద్దుకుంటున్న సరస్వతి క్షేత్రం

**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యారంగంలో ప్రైవేటీకరణ వేగం పుంజుకుంది. వసతుల లేమి, సరైన బోధన లేక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి నానాటికి తీసికట్టు నానంబొట్టు అన్న చందంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రైవేటులో ఫీజులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించలేక ప్రైవేటులో ఫీజులు చెల్లించలేక క్రమేపి విద్యకు దూరం అవుతున్నారు. ప్రభుత్వ రంగంలోనే పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించాలన్న లక్ష్యంతో రూపుదిద్దుకున్నదే యంగ్ ఇండియా ఇంటర్నేషల్ స్కూల్. ప్రతి నియోజక వర్గంలోనూ యంగ్ ఇండియా స్కూల్స్‌ను నిర్మించి ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు వసతితో పాటు బోధన ద్వారా ఓ మేధో తరాన్ని తయారు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానిది. ఒక్కో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించి 20 నుంచి 30 ఎకరాల స్థలాన్ని కూడా అందుబాటులోకి తెచ్చి ఈ పాఠశాలను నిర్మిస్తున్నారు. మొత్తం 2,500 మంది విద్యార్థులకు విద్యా బోధన, వసతి, లైబ్రరీ, ఇండోర్, అవుట్‌డోర్‌కు సంబంధించిన క్రీడా ప్రాంగణాలు, డార్మెంటరీ, సెమినార్ హాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది ఉండేందుకు విడివిడిగా ప్రత్యేక బ్లాకులను నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో అన్నింటి కంటే ముందుగా మధిర నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా స్కూల్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే రూ. 60 కోట్లకు పైగా ఖర్చు చేసి దాదాపు భవన నిర్మాణాలను పూర్తి చేశారు. ఈ యంగ్ ఇండియా స్కూల్‌లో నాలుగు జూనియర్ హాస్టల్స్, తొమ్మిది సీనియర్ హాస్టల్స్‌ను నిర్మిస్తున్నారు. 1250 మంది విద్యార్థులు ఒకేసారి అల్పాహారం, భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాల్స్ నిర్మాణం జరుగుతుంది. ఇందుకు తగినట్లుగానే వంట గదుల నిర్మాణాన్ని చేపట్టారు. తరగతి గదుల నిర్వహణకు సంబంధించి నాలుగు ప్రత్యేక బ్లాకులను నిర్మించారు. పరిపాలన సౌలభ్యానికి అనుగుణంగా పరిపాలన విభాగానికి సంబంధించిన భవన నిర్మాణం కూడా పూర్తి కావచ్చింది. 24 గంటల పాటు నిరంతరాయంగా పనులు జరుగుతున్నాయి. వెయ్యి మంది కూర్చునేవిధంగా మల్టీ సెమినార్ హాల్‌ను నిర్మిస్తున్నారు. ఈ హాల్‌ను సెమినార్‌తో పాటు ఇండోర్ గేమ్స్‌ను కూడా పిల్లలు ఆడుకునేవిధంగా నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ సరస్వతి క్షేత్రం దోహదపడనుంది. పెరిగిన పోటీ ప్రపంచంలో తట్టుకుని అత్యుత్తమ స్థాయికి పిల్లలు ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది.

### సాకారం దిశగా భట్టి కల :

విద్య ద్వారానే కుటుంబ స్థితి గతులతో పాటు సమాజ మార్పు సాధ్యమని నమ్మిన వారిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఒకరు. అన్ని వసతులు కల్పిస్తే ఏ ఒక్కరూ తక్కువ కాకుండా ఉత్తమ ప్రతిభను కనబరుస్తారని నమ్మే భట్టి విక్రమార్క యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణానికి ఆలోచన చేశారు. వసతులు కల్పించడం, ఉత్తమ విద్యను బోధించడం, శాస్త్ర సాంకేతిక క్రీడా రంగాల్లో ఉత్తమ శిక్షణ ఇప్పించడం ద్వారా ఈ దేశానికి నిష్ణాతులైన ఓ తరాన్ని అందించేందుకు చేసిన ప్రయత్నమే యంగ్ ఇండియా స్కూల్స్. ఆయన నియోజక వర్గం మధిరలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం పూర్తి కావస్తుండడంతో ఆయన కల సాకారమవుతుంది. మధిర నియోజక వర్గ పర్యటనకు వచ్చినప్పుడల్లా ఈ యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను పర్యవేక్షించడంతో పాటు ప్రతి రోజు అధికారులతో నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకునే వారు. సమీక్షలు నిర్వహించే వారు. ఇప్పటికే పాఠశాల చుట్టూ మౌలిక వసతుల కల్పనకు సంబంధించి డబుల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎటునుంచైనా అతి త్వరగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలకు చేరుకునేవిధంగా రహదారులనిర్మాణం జరిగింది. 20 ఎకరాల్లో రూపుదిద్దుకుంటున్న ఈ పాఠశాలకు



చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారు. ఒక రాతిగుట్టను సరస్వతి క్షేత్రంగా మార్చడంతో రానున్న రోజుల్లో ఈ పాఠశాల ఒక పర్యాటక క్షేత్రంగా రూపుదిద్దుకోనుంది. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దే ఈ యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి అంకురార్పణ చేసిన భట్టి విక్రమార్క నిజంగా అభినందనీయుడు. రాతి గుట్టను కేటాయించి పట్టు వదలని విక్రమార్కుడిలా భట్టి విక్రమార్క ఈ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు.

### మార్చి నాటికి అందుబాటులోకి : ఈఈ బుగ్గయ్య

మార్చి నాటికి లక్ష్మీపురం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ అందుబాటులోకి రానుందని ఈఈ జే. బుగ్గయ్య తెలిపారు. భవనాల నిర్మాణం పూర్తయిందని అంతర్గత పనులు మిగిలి ఉన్నాయన్నారు. చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణం, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. అన్ని వసతులతో నాణ్యతతో యంగ్ ఇండియా స్కూల్ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి మార్చిలోకి అందుబాటులోకి రానుందన్నారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించే విధంగా వేగంగా పనులు చేస్తున్నామని ఆయన తెలిపారు.

# పర్యాటక భాండాగారం భద్రాద్రి

**(మొదటిపేజీ తరువాయి)** రాముడు సీతా లక్ష్మణుడు రావణుడి ఆనవాళ్లు శిల్పాలు ప్రకృతి వాతారణం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ రామాయణ థీమ్ పార్కు వివరణాత్మక సమాచార కేంద్రం గైడ్ సేవలు స్థానిక హస్తకళల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పర్యాటక అనుభవం మరింత మెరుగుపడుతుంది.

**కిన్నెరసాని అందాలు, వన్య ప్రాణులు :** పాల్వంచ సమీపంలోని కిన్నెరసాని ప్రాంతం జిల్లాలోని ముఖ్యమైన ప్రకృతి పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా విలసిల్లుతోంది. కిన్నెరసాని నది, జలాశయం, అడవులు, వన్యప్రాణులు, ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ. తెలంగాణ పర్యాటక శాఖ కిన్నెరసాని వన్యప్రాణులు అభయారణ్యం 635.4 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ ఇప్పటికే ఇకో టూరిజం అభివృద్ధికి ప్రాజెక్టు ప్రతిపాదన పనులు చేపట్టినట్లు జిల్లా పర్యాటక శాఖ పేర్కొంది. సఫారీ ప్రకృతి నడక మార్గాలు పక్షివీక్షణ కేంద్రాలు పిల్లల కోసం ప్రకృతి విద్యాకేంద్రాలు సురక్షితమైన బోటింగ్ వంటి సౌకర్యాలను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా అభివృద్ధి చేయవచ్చు.

**నదీ పర్యాటకానికి అపారమైన అవకశాలు :** గోదావరి నది జిల్లాకు మరో ప్రధాన సహజ సంపద. భద్రాచలం నుండి పాపికొండల వైపు సాగిపోయే నదీ ప్రయాణం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. గోదావరి తీరంలో సురక్షితమైన రివర్ ఫ్రంట్‌లు, వ్యూ పాయింట్లు బోటింగ్ జెట్టీలు సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు స్థానిక ఆహారకేంద్రాలు అభివృద్ధి చేస్తే నదీ పర్యాటకానికి మరింత ఊతం లభిస్తుంది.

**గిరిజన సంస్కృతికి ప్రత్యేక స్థానం :** జిల్లా గిరిజన సంస్కృతి సంప్రదాయాలు జానపద కళలు అటవీ ఆధారిత జీవన విధానానికి ప్రసిద్ధి. పర్యాటక అభివృద్ధిలో గిరిజన సమాజాన్ని భాగస్వాములు చేయడం అత్యంత ముఖ్యమైంది. గిరిజన హస్త కళలు వెదురు ఉత్పత్తులు సంప్రదాయ వంటకాలు జానపద కళారూపాలు పరిచయం మరింతగా చేయడంతో పాటు ట్రైబల్ టూరిజం సెంటర్‌ను ఏర్పాటు చేస్తే పర్యాటకులతో పాటు స్థానికులకు ఉపాధి ఆదాయ అవకాశాలు కల్పించవచ్చు.

**ఆకట్టుకుంటున్న జలపాతాలు :** జిల్లాను ఆనుకుని ఉన్న బొగత జలపాతంతో పాటు చిన్నాపెద్ద జలపాతాలు, వాగులు వంకలు ప్రకృతి రమణీయ ప్రదేశాలున్నాయి. మణుగూరు ఇల్లెందు వాజేడు చర్ల అశ్వారావుపేట దుమ్ముగూడెం తదితర ప్రాంతాల్లోని సహజ ప్రదేశాలను గుర్తించి మండలాల వారీగా నేచర్ టూరిజం మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉంది.

**ఇలా చేస్తే మేలు :** జిల్లా పర్యాటరక రంగాభివృద్ధికి ముందుగా అన్ని పర్యాటక ప్రాంతాలపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. రహాదార్లు పార్కింగ్ తాగు నీరు మరుగుదొడ్లు విద్యుత్ మొబైల్ నెట్‌వర్క్ వైద్య సహాయం భద్రతా సిబ్బంది వంటి ప్రాథమిక వసతులు కల్పించాలి. తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి. క్యూఆర్ కోడ్ ద్వారా చరిత్ర ప్రదేశ విశేషాలు మార్గం వసతి అత్యవసర ఫోన్ నెంబర్లు వంటి సమాచారాన్ని అందుబాటులోకి తేవాలి. భద్రాచలంపర్ణశాలకిన్నెరసాని కొత్తగూడెం చర్ల తాలిపేరువాజేడు బొగత వంటి ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ రూపొందించవచ్చు. దీనికి తోడు గిరిజన సంస్కృతి జలపాతాలు అడవులు గోదావరి నదీ విహారాన్ని కలిపితే పర్యాటకులకు బహుముఖ అనుభూతి లభిస్తుంది.

జిల్లా పర్యాటకానికి కావాల్సిన వనరులను ఇప్పటికే కలిగుంది. అవసరమైన వాటిని గుర్తించి అనుసంధానించి మౌళిక వసతులు కల్పించి స్థానిక ప్రజలను భాగస్వాములను చేస్తూ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక పర్యాటక గమ్యస్థానంగా ఎదిగే అవకాశముంది.

# మోడీ పాలనను నిరసిస్తూ జైల్‌భరో

**(మొదటిపేజీ తరువాయి)** ఆరోపించారు. కార్పొరేట్ల కోసం సాగుతున్న ఈ పాలనను నిరసిస్తూ ఆందోళన చేపట్టనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన అందరికీ ఇండ్లు ఇవ్వాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ సిఫారసు చేసిన వారికి మాత్రమే ఇండ్లు ఇచ్చి అసలైన పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా కొన్ని హామీలకు సంబంధించి కనీసం ఊసెత్తడం లేదన్నారు. హామీల అమలుకు కార్యాచరణ ప్రకటించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూ బాగోతం నడుస్తుందని అధికార, విపక్షాల మధ్య విమర్శ, ప్రతి విమర్శలలో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పరస్పర ఆరోపణల ద్వారా అక్రమ ఆస్తుల వ్యవహారం వెలుగు చూస్తుందని కానీ పేదల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ లతో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదని ఆయన తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా వృథాగా పోతున్న వర్షపు నీటిని చెరువులకు మళ్లించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీటిని సంరక్షించాలని ఆయన కోరారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా జిల్లాలో చెరువులు, కుంటలు నింపాలని ఇందు కొరకు ఒక ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అనేక దశాబ్దాలుగా పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములపై వారికే హక్కు కల్పించాలని ఆయన కోరారు. ఐదారు దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూములుగా చూపడం అన్యాయమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులను బతకనియని స్థితిని నెట్టివేశాయని ఆయన తెలిపారు. ఒక పక్క సంక్షేమ పథకాలు నిలిచిపోయి మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధమైందని ఆయన ప్రకటించారు. ఒక పక్క పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ మరో పక్క ప్రజా ఉద్యమ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు హేమంతరావు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

**(మొదటిపేజీ తరువాయి)**

డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ గుట్టు రట్టయిన తర్వాత మోడీ, అమిత్‌షాల బండారం బయటపడిందన్నారు. ప్రజా బలంతో కాకుండా ఎన్నికల సంఘం మాయాజాలంతో బిజెపి అధికారంలోకి వచ్చిందన్న విషయం స్పష్టమైందని సురేష్ తెలిపారు. దేశంలో జ్ఞానేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ బిజెపి చెప్పు చేతల్లో పెట్టుకున్నారని రాజ్యాంగ సంస్థలు ఇప్పుడు ప్రజల కోసం కాకుండా బిజెపి కోసం పని చేస్తున్నాయని ఆయన తెలిపారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ధరల నియంత్రణ, కార్మిక చట్టాల రద్దు, నూతన సాగు చట్టాలు, ఇలా అన్ని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని సురేష్ ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. రాజీనామా తర్వాత ఆయనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని సురేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లైమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, దొండపాటి రమేష్, జాగర్లమూడి రంజిత్, బెజవాడ రవి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, మల్లికార్జున్, యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

# అమ్మపేటలో ఉచిత పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని అమ్మపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి భద్రమ్మ ప్రారంభించి మాట్లాడారు. పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, పాడి ఉత్పత్తుల పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు. పశువుల గర్భకోశ పరీక్షలు, చూడు పరీక్షలు, పశువుల ఆరోగ్య పరిస్థితి పరిశీలించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. దూడలకు నట్టల నివారణ మందులు తాగించి, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ పశువైద్యాధికారి పి.అశోక్, డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వర్లు, పశువైద్య సిబ్బంది రోహిత్, త్రివేణి, గోపాల మిత్రులు సుమన్, సైదులు, అరుణ, రాము, నరేశ్, మస్తాన్‌బాబా, వీరనారాయణ, రాంపాషా తదితరులు పాల్గొన్నారు.



# యువతే దేశ భవిష్యత్..లక్ష్య సాధనకు కృషి చేయాలి




**ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ వి సోమిరెడ్డి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుని వాటి సాధనకు కష్టపడి చదవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ వి సోమిరెడ్డి సూచించారు. శనివారం ఖమ్మం హరితా గార్డెన్‌లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాలు క్షణిక ఆనందాన్ని చూపించి జీవితాంతం నష్టాన్ని మిగిల్చే ప్రమాదకరమైన ఉచ్చులని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తమ భవిష్యత్తుకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటుపడి ఆరోగ్యం, విద్య భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.తల్లి దండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన భాధ్యత ప్రతి విద్యార్థి పై ఉందన్నారు. తన జీవితంలో ఎదురైన అనుభవాలను, ఉన్నత స్థాయికి చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న కష్టాలను విద్యార్థులతో పంచుకుని వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. డ్రగ్స్‌కు నో చెప్పడం ఒక్కరి బాధ్యత కాదు .. ప్రతి యువకుడి సామాజిక భాధ్యత అని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చదువును ఆయుధంగా చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లి దండ్రులు గర్వపడేలా ఎదిగి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, కరస్పాండెంట్ శ్రీవిద్య, గురుదక్షిణ ఫౌండేషన్ కార్యదర్శి చావా సత్యనారాయణ ప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్యాయంపై ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం



**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అన్యాయంపై చాకలి ఐలమ్మ జరిపిన పోరాటం చిరస్మరణీయమైనదన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. తెలంగాణ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు సత్తుపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వేంసూరు రోడ్డులోని దోబీఘాట్, మెయిన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా నిర్వహించిన కార్యక్రమాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రిహానా బేగం కమల్ పాషాలు ముఖ్య అతిథులుగా పాల్గొని ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేంసూరు రోడ్డులో రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఒక వర్గానికే పరిమితమైన నాయకురాలు కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మెయిన్‌రోడ్డులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రహేనా బేగం కమల్ పాషా, సీపీఎం నాయకులు మోరంపూడి పాండు తదితరులు పాల్గొన్నారు. ఐలమ్మ ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో బీసీ, రజక సంఘాల నాయకులు, కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళలు, యువత, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పిఈటి కీచక పర్వానికి తెర

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఫోక్సో కేసు నమోదు
- కలెక్టర్ కమిటీలోను అసభ్య ప్రవర్తన గుర్తింపు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు






**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పాఠశాల అంటే పిల్లల చదువుతో పాటు భద్రత భరోసా కల్పించే ప్రదేశం. నాన్న ప్రేమ..తల్లి లాలనను అందించాల్సిన దేవాలయం. కానీ అలాంటి ప్రదేశంలో ఓ పీఈటీ కీచక పర్వానికి పాల్పడి వ్యవస్థకే మాయని మచ్చగా మారాడు. చేసిన తప్పుకు గాను విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎట్టకేలకు జైలు ఊసలు లెక్కెట్టాల్సిన పరిస్థితిని కొని తెచ్చుకున్నాడు. ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని గుదిమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షేక్ షఫీ అహ్మద్ అనే పీఈటీ గత 13 సంవత్సరాలుగా అక్కడే పని చేస్తున్నాడు. అయితే తాజాగా 8,9,10 తరగతులకు చెందిన సుమారు 22మంది విద్యార్థినిలకు స్పోర్ట్స్ నేర్పిస్తున్న అన్న నేపంతో గత అసభ్యకరంగా ప్రవర్తించాడు. గత కొంతకాలంగా సింగిల్‌గా రూమ్‌లోకి పిలిచి చెప్పుకోని రీతిలో వ్యవహారం చేస్తుండేవాడు. దీనిపై విద్యార్థినులు సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి దృష్టికి కూడా తీసుకువెళ్లారు. అయినప్పటికీ లాభం లేకపోవడంతో తల్లిదండ్రులకు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. అయితే విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలకు చేరుకుని, తల్లిదండ్రుల వద్ద నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.ఈ నేపథ్యంలో నిఘా వర్గాలు సైతం ఘటనపై సమగ్రమైన ఆరా తీశాయి. అంతేకాకుండా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్ఐ రాయుడు నేతృత్వంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ సూచనలతో నియమించిన కమిటీలో సైతం విద్యార్థినులు ద్వారా కీచక పర్వాన్ని గుర్తించినట్లు తెలిసింది. అదే నివేదికను కలెక్టర్‌కు కూడా పంపించడంతో పాటు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కీచక పీటీపై ఫోక్సో కేసు నమోదు చేసి..రిమాండ్‌కు తరలించారు.

# తనికెళ్లలో డిఎంఅండ్‌హెచ్‌వో ఆకస్మిక తనిఖీ





**ప్రజాపక్షం/కొణిజర్ల:** తనికెళ్ల గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.రామారావు శనివారం పర్యటించి పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసేవలు, రికార్డు నిర్వహణ, టీకా కార్యక్రమం, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలును పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా సిబ్బంది బాద్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్సీ హాస్టల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, పరిశుభ్రతను పరిశీలించారు. బాలికలకు హెచ్‌పివి టీకా ప్రాధాన్యత, సర్వైకల్ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. పాఠశాల కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార తయారీ విధానాలను పరిశీలించారు. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులపై ఏటిఆర్‌లు వెంటనే సమర్పించాలని, కుక్కకాటు, నెలవారి నివేదికలను నిర్ణీత సమయంలో అందిచంఆలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణీలను అవసరమైనప్పుడు సకాలంలో ప్రబుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగుదాం



**ప్రజాపక్షం/చింతకాని :** చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగుదామని చింతకాని ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ .. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరెండెంట్ జానీమియా, మండలపరిషత్ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మామపై అల్లుడు గొడ్డలితో దాడి

**ప్రజాపక్షం/చింతకాని :** మామపై అల్లుడు గొడ్డలితో దాడి చేసిన ఘటన చింతకాని మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన షేక్ ఉద్దండు సాహెబ్ తన కూతురుకు అదే గ్రామానికి చెందిన తన తన మేనల్లుడైన షేక్ నాగుల్‌మీరాకి ఇచ్చి వివాహం జరిపించాడు. నాగుల్‌మీరా అతని భార్యకు మధ్య విభేదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. కూతురును కాపురానికి పంపే విషయమై భార్య తండ్రి ఉద్దండ్ సాహెబ్ అభ్యంతరం చెప్తున్నాడని ఆగ్రహంతో నాగుల్‌మీరా శనివారం భార్య పుట్టింటికి వెళ్లి మామపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఉద్దండు సాహెబ్‌కు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మిరాకిల్ లో లిటిల్ స్టార్స్-సూపర్ మామ్స్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని సిద్దారం రోడ్డులో గల మిరాకిల్ మైండ్స్‌ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం "లిటిల్ స్టార్స్ అండ్ సూపర్ మామ్స్ విత్ మిరాకిల్ టీచర్స్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 200 మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. నర్సరీ, ఎల్ కే జి,యూకే జి, విద్యార్థులకు పొటాటో రేస్, బాల్ కలెక్టింగ్, బెలూన్ గేమ్స్ నిర్వహించారు. పిల్లలుతల్లిదండ్రుల మధ్య అనుబంధం, సమన్వయం పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బి.గంగారం 15వ ప్రత్యేక పోలీసు పటాలంలో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పటాలపు కమాండెంట్ ఎన్. పెద్దబాబు ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఎ. అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ బి. వేణుగోపాలరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల క్షేత్ర పర్యటన






**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రైమరీ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగాశ్రీవైష్ణవి మిల్క్ ప్రొడక్ట్స్, శ్రీవెంకట సాయి రైస్‌మిల్‌తో పాటు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. పాల ఉత్పత్తుల తయారీ విధానం, ధాన్యం నుంచి బియ్యం తయారయ్యే ప్రక్రియ, వరి సాగు విధానాలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులకు అవి ఎక్కువకాలం గుర్తుండిపోతాయన్నారు. రైతులు పంటలు పండించేందుకు పడుతున్న శ్రమ, ధాన్యం నుంచి బియ్యం తయారీ, పాల నుంచి వివిధ ఉత్పత్తుల తయారీ విధానాలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహం వద్ద అన్నదానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తా వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ మాజీ వైరా పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్, 17వ వార్డు మాజీ కౌన్సిలర్ తడికమళ్ల నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి దేవరాజు, గుగులోతు రాము, నల్లబోలు వెంకటరెడ్డి, మాజీ వార్డు సభ్యులు కారుకొండ బోసు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, వాంకుడోతు వీరన్న, మాచర్ల శంకర్, మండల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉప్పె వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటేశ్వర్లు, ఆర్ఎంపి బానోతు కృష్ణ, ఎల్ఐసి శ్రీను పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయసాధనకు పాటుపడాలి

**- కలెక్టర్ అంకిత్**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భూమికోసం భుక్తికోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని ఆమె ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం ఐడిఓసిలో బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. దేశ్‌ముఖ్‌లు రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడారని, తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి మహిళల్లోస్ఫూర్తిని నింపారని చెప్పారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించ డంతో పాటు వారి ఆశాయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి సమి ష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి విజయలక్ష్మీ, జిల్లా అధికారులు, బిసి సంఘాల నాయకులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌పి కార్యాలయంలో :** చాకలి ఐలమ్మ 131వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఆమె పోరాటాన్ని అధికారులు స్మరించుకున్నారు. ఎస్‌పి శ్రీనివాస్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో :** గ్రంథాలయంలో జరిగిన చాలమ్మ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ పి.వీరబాబు ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలేసి నివాళ్లర్పిం చారు. అనంతరం మాట్లాడుతూ మహిళశక్తి ముందు దేశముఖ్‌లు రజా కార్లు పరారయ్యారని, నిజాం నిరంకుశత్వాన్ని సైతం ఎదురించారని చెప్పారు. నేటి యువత అదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ చదువుల్లో రాణించి మంచి ఉద్యోగాలు సాధించి జీవితాల్లో స్థిరపడాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కరుణ కుమారి, గ్రంథపాలకులు లలితకుమారి మణిమ్మదుల గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణేష్ నిమజ్జన యాత్ర





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘం, వడ్డెర సంఘాల ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హారతుల అనంతరం గణేశు డిని అలంకరించిన వాహనంపై ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు భజనలు, కోలాటాలు, నృత్యాలతో సందడి చేస్తూ గణపతి బప్పా మోరియా నినాదాలతో యాత్రను నిర్వహించారు. స్థాని కులు తాగునీరు, ప్రసాదాలు అందించగా, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం గంగమ్మ వాడ వద్ద ప్రత్యేక హారతుల మధ్య గణేశుడి నిమజ్జనం నిర్వహించారు. ఉత్సవాలు ప్రజల్లో భక్తి, ఐక్యతను పెంపొందిస్తా యని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణిలో రూ 3లక్షలతో సైడ్ డ్రైనేజీ పూర్తి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల కేంద్రంలో రూ 3లక్షల ఎంపీ నిధులతో నిర్మిం చిన సైడ్ డ్రైనేజీ కాలువను సర్పంచ్ మేదరి వీర ప్రతాప్(టోనీ)శనివారం ప్రారంభించారు. కాలు వ నిర్మాణంతో వర్షపు నీరు, మురుగు సాఫీగా వెళ్లి స్థానికులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలి పారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రజలు అవసరాలకు అనుగు ణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమ న్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ అధ్య క్షుడు భీమవరపు శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు తోటకూరి రాంబాబు, ఇమ్మడి తిరుపతి రావు, యాకూబ్, పెద్దమ్మ, భాగ్యలక్ష్మి, తాజుద్దీన్, తొగర శ్రీను, విజయ్, ఆదేర్ల అంజయ్య, కాంట్రాక్టర్ గుగులోత్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంతోష్ నగర్ లోనే చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు. చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తాం.. చాకలి ఎల్లమ్మకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మణు గూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు లు మాట్లాడుతూ 1895 కిష్టాపురం గ్రామం వరంగల్ జిల్లాలో జన్మించిన చిట్యాల ఐలమ్మ చిన్ననాటి నుండి అభ్యుదయ భావ జాలంతో ఎక్కడ అన్యాయం జరిగిన వాటిని ఎదిరిస్తూ మాట్లాడే వారిని, సమాజం పట్ల అవగాహన కలిగి భూస్వాములకు వ్యతిరేకంగా ఆనాడు రజాకార్లు పెత్తందారులు, చేసే అరాచకాలకు వ్యతిరేకంగా తిరుగు బాటు కొనసాగిస్తూ ఉండేవారని, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆనాడు చాకలి ఐలమ్మ గా పోరాటం కొనసా గించి,దొరల గడిలను బద్దలు కొట్టి ,వేలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర చాకలి ఐలమ్మ, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని భావితరాలు ముందుకు సాగాలని, చాకలి ఐలమ్మ చరిత్రను ప్రజలకు తెలియజేసేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోంది కుటుంబరావు, మహిళా సమైక్య మండల కార్యదర్శి కోడిమెల్ల సుజాత, ఏఐటీయూసీ మండల కోశాధికారి కొత్త పల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు ఆధార్ల రాములు ఏఐటీయూసీ నాయకులు బోశెట్టి సంపత్, రంగు ఆంజనేయులు పాల్గొన్నారు.

# మాదారంలో చేయూత పింఛన్ల వెరిఫికేషన్



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం గ్రామ పంచా యితీ పరిధిలో చేయూత పింఛన్ల లబ్ధిదారుల వెరిఫికేషన్‌ను సర్పంచ్ అజ్మీర ఉమారాణి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. పంచాయితీ రాజ్ ఏఈ రాజశేఖర్ ఇంటింటికీ వెళ్లి లబ్దిదారుల వివరా లను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోం దని సర్పంచ్ ఉమ నరేష్ తెలిపారు. పింఛన్ కోసం ఎవరూ దళారులను ఆశ్రయించవద్దని, సమ స్యలు ఉంటే నేరుగా పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి తెలియజే యాలని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి విజయ్, అజ్మీర బాలాజీ, వి భారతి, వీరన్న, కాసాని లక్ష్మీ నారాయణ, కోయాల శ్రీను, బట్టు నరసయ్య, బట్టు సంగయ్య, పంచాయితీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ శని వారం ఆకస్మిక తనిఖీలు నిర్వ హించారు. పీహెచ్‌సీ ఎర్ర గుంట పరిధిలోని అన్నపురెడ్డి పల్లి సబ్ సెంటర్‌లో ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు, రిజిస్టర్లు, సిబ్బంది పనితీరును పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తు లకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు కచ్చితంగా నిర్వ హించి, అవసరమైన వారికి సకాలంలో వైద్యం, రిఫరల్ సేవలు అందిం చాలని ఆదేశించారు. అనంతరం రెండు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంట ర్లను తనిఖీ చేసి అనుమతులు, నమోదు వివ రాలు పరిశీలించారు. ఒక కేంద్రం నమోదు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించి నోటీసు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ సమ ర్పించాలని ఆదేశించిన డీఎంహెచ్ఓ, నిబంధ నలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అన్నపురెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ బాలి కల విద్యాలయంను సందర్శించిన ఆయన విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, కుక్కకాటు, రేబీస్ నివారణపై అవగాహన కల్పించారు. సమయానికి వైద్య సేవలు పొందితే రేబీస్‌ను నివారించవ చ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిది నెలలుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

## పట్టించుకోని అధికారులు..ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రం లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సమీపంలో మిషన్ భగీరథ తాగు నీటి పైప్‌లైన్ ఎనిమిది నెలలుగా లీకవుతున్నా శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. లీకైన నీరు రోడ్డుపై చేర డంతో ప్రాంతం బురదమయమై దుకాణదారుడు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు వృథా కావడంతో పాటు రహదారి కూడా దెబ్బతింటోందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డిను వివరణ కోరగా లీకేజీ ఉన్నది వాస్తవమేనని, అయితే అది చిన్న లీకేజీ కావడంతో పెద్ద ఇబ్బంది లేదని, త్వరలో మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న లీకే జీని చిన్న సమస్యగా చూడటం సరికాదని స్థానికులు పేర్కొంటూ, తక్షణమే శాశ్వత మరమ్మ తులు చేపట్టి రహదారిపై నీటిముంపు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# హరిణి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ**




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం వెంకన్న పాలెం గ్రామానికి చెందిన నర్సింగ్ విద్యార్థి హరిణి ని హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శాంతియుత విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ మాట్లాడుతూ జూలూరుపాడు మండల కేంద్రంలో పట్టపగలు హరిణిని హత్య చేయడం అత్యంత బాధాకరమైన వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే హరిని హత్య చేసిన హంతకు లను కఠినంగా శిక్షించి ఇంకో ఆడపిల్ల పై ఇలాంటి ఘటనలు చేయా లంటే భయపడే విధంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకు 6 సంవత్సరాల ఆడపిల్ల నుండి 66 సంవత్సరాల వరకు ఆడవారి పైన వరస ఘటనలు జరుగుతున్నాయి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి ఆ తప్పు ఇంకొక ఇంకెవరైనా చేయాలంటే భయం పుట్టేలా కట్టిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా హరిణి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే హరిణి హత్యపై సమగ్ర న్యాయ విచారణ జరిపించి కారుకులను అత్యంత కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్, బాలాజీ, అఖిల్, లితికేష్, శిరీష, దివ్య, సింధు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు మణుగూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి మణుగూరు రజక కుల బాంధవులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటి నిజాం,రజాకార్ల అరాచకాలకు,భూస్వామ్య వెట్టిచాకి రికి ఎదురొడ్డి నిలిచిన వీర వనిత అని వక్తలు అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయ న్నారు. ఆమె ధైర్య సాహసాలు నేటి తరానికి ఎంతో ఆదర్శ మన్నారు.అన్యాయాన్ని ఎదిరించడంలో మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయు రాలు ఐలమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల రజక నాయ కులు,యువకులు పాల్గొన్నారు.

# కేంద్రం మొండివైఖరి వల్లే సమ్మె అనివార్యమైంది



**- ప్రజలను బ్యాంకు ఉద్యోగులను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలి**
**- బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లే సమ్మె అనివార్యమైందని తద్వారా ప్రజలు బ్యాంకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. శనివారం మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఎస్‌బిఐ కొత్తగూడెం బ్రాంచ్‌ను సందర్శించి ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ పాలకులు ఇప్పటికైనా మొండి వైఖరిని విడనాడి ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. సమ్మె కారణంగా ఆర్థిక కార్యకలాపాలు స్తంభించి సామాన్య ప్రజలు ఖాతాదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి ఐదురోజుల పనివిధానం అమలుపై ఐబిఏ యూనియ్లు మధ్య కుదిరిన ఒప్పందాన్ని కేంద్రం గత రెండుళ్లుగా తొక్కి పట్టడం దుర్మార్గమన్నారు. బ్యాంకింగ్ రంగంలో సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న ద్వైపాక్షిక ఒప్పందాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చర్యలతో ఖరారైన పిఎల్‌ఐ విధానాన్ని మార్చి కేవలం ఉన్నతాధికారులకే లబ్ది చేకూరుస్తూ ఉద్యోగు మధ్య అంతరాలు సృష్టించే కుట్రలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలుచేసేలా బ్యాంకింగ్ రంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కేంద్రం వెంటనే విరమించుకోవాలని లేదంటే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం

**- మేయర్ మూడ్ గణేష్**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పట్టణ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న కోతుల బెడదను శాశ్వతంగా పరిష్కరించడమే ధ్యేయంగా కార్పొరేషన్ యంత్రాంగం పనిచేస్తుందని కొత్తగూడెం నగర్ మేయర్ మూడ్ గణేష్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో శనివారం 16వ డివిజన్ పరిధిలోని రామవరం అంబేద్కర చమన్ వద్ద కోతులను బంధించేందుకు ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియతో పాటు కోతులను బంధించే విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలలో కోతుల బెడద ఎక్కడ ఎక్కువగా ఉందో ఆ ప్రాంతాల్లో సమస్యను పరిష్కరించేందుకు నిపుణులైన బృందాలను రప్పించినట్లు వెల్లడించారు. పలు డివిజన్లలో ఇప్పటికే కోతుల దాడుల్లో స్థానికులు గాయపడిన ఘటనలు తన దృష్టికి వచ్చాయని, స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఆదేశాలతో పాటు స్థానిక కార్పొరేటర్లు ప్రజల విజ్ఞప్తుల మేరకు యుద్ధ ప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టనటుల ఆయన తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం భయాందోళనలు కలుగకుండా అన్ని డివిజన్ల వ్యాప్తంగా విడతలవారీగా కోతులను పట్టుకుని సురక్షితమైన అటవీ ప్రాంతాలకు తరలించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, బ్రాంచ్ కార్యదర్శి మద్రి గోపికృష్ణ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ చారి జవాన్ లక్ష్మ ణ్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఏఐఎస్ఎఫ్

**- ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 28, 29, 30 హనుమకొండ వేదికగా విద్యార్థుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ 1936లో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ తొమ్మిది దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తూ, విద్యార్థుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తోందని ఆయన తెలిపారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని ఏఐఎస్ఎఫ్ నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. ప్రస్తుతం విద్యార్థుళు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్సమెంట్, హాస్టల్ సమస్యలు, ఉపాధ్యాయులులెక్చకర్ల కొరత, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత వంటి సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులను ఐక్యం చేసి పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని ఘనంగా చాటిచెప్పే విధంగా నిర్వహిస్తున్న 90వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాల్లో విద్యార్థులు, యువత, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వరక అజిత్ కోరారు. ''విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం'' అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్, మురళి, సమీర్, కళ్యాణి, వసంత, కవిత పాల్గొన్నారు.

# హరిణి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలో ఇటీవల మృతి చెందిన 18 ఏళ్ల హరిణి కుటుంబాన్ని ఎంఆర్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బృందం పరామర్శించింది. కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పింది. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి ఎంఆర్పీఎస్ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, హరిణి మృతికి కారణమైన వారెవరైనా ఉంటే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హరిణిని ప్రేమ పేరుతో మోసం చేసి, ఒత్తిడికి గురిచేశారనే కుటుంబ సభ్యులు, స్థానికుల ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సోమయ్య, ఈసంపల్లి కృష్ణ, చంగల గురునాథం, కొమ్ము హుస్సేన్, చాపలమడుగు వెంకటేశ్వరలు, మాదిగ మహిళా అధ్యక్షురాలు బోప్పి భాగ్య, మేకల లత, రాష్ట్ర నాయకులు, సమ్మక్క రాష్ట్ర నాయకులు, నల్లగట్ల వెంకన్న, బోయిళ్ళ వెంకటేశ్వర్లు, గార్లపాటి కృష్ణ, బోయ జగన్నాధం, చిట్యాల రజిత, కొమ్ము హుస్సేన్, వంగూరి రామ్మూర్తి, కాకటి బాబు, కొలిక పోగు కాంతారావు, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు దిబ్బందుల సాయికుమార్, విసనపల్లి కళ్యాణ్, ఎంఎస్‌పి అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలోని అశోక్ నగర్ ఆరోగ్య ఉపకేంద్రంలో జరుగుచున్న వ్యాధి నిరోధక టీకాలను శనివారం డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర శ్రీధర్ పరిశీలించి, సరైన సమయంలో సరైన టీకాలను ఇవ్వాలని, వాక్సిన్ కోల్డ్ చైన్ సిస్టం ను పాటించాలని, ఏఈఎఫ్ఐ కిట్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను, వార్డ్, ల్యాబ్ రికార్డు పరిశీలించి తగు సూచలను చేశారు. సిబ్బంది తో మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ, టార్గెట్ రీచ్ కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాదేవి, డిపిఎంఓ శ్రీనివాస్, సీహెచ్‌ఓ వీరాస్వామి పాల్గొన్నారు.

# నెల్లిపాకలో జల మహోత్సవం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** జల్ జీవన్ మిషన్ జల మహోత్సవంలో భాగంగా నెల్లిపాక గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ ఎం వెంకట రామకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిశోర్ మిషన్ భగీరథ తాగునీటి పథకంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతోందన్నారు. నీటిని వృథా చేయకుండా సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ పాలకమండలి సభ్యులు, గ్రామ ప్రజలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పెత్తందారుల అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. సమానత్వం కోసం ఆమె పోరాటం నేటితరానికి స్ఫూర్తిదాయకమని, మహిళా లోకానికి ఐలమ్మ ఆదర్శమని కొనియాడారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నాయకులు, సభ్యులు, పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/గుండాల:** మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రజక సంఘం నాయకులు గడ్డం లాలయ్య, గడ్డం వీరన్న మాట్లాడుతూ పెత్తందారుల దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా పోరాడి బడుగు, బలహీన వర్గాల విముక్తికి ఐలమ్మ కృషి చేశారని కొనియాడారు. ఈకార్యక్రమంలో గడ్డం రవి, గడ్డం నారాయణ, గడ్డం మోహన్, గడ్డం నాగేష్, గామాలపాటి లక్ష్మీనారాయణ, గామాలపాటి నవీన్‌కుమార్, గడ్డం శ్రీను, గడ్డం రాజేష్, గడ్డం రమేష్, సట్టు లాలయ్య, గడ్డం పాపయ్య, గడ్డం శ్రీకాంత్, గడ్డం రామకృష్ణ, గడ్డం సుమంత్, గడ్డం హేమంత్‌కుమార్, గామాలపాటి రాహుల్, సంతపురి చైతన్య, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల నాగేష్, మండల నాయకుడు కొంద్రు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/ఇల్లందు:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని ఇల్లందు పట్టణంలోని జగదంబ సెంటర్‌లో గల దిండిగల రాజేందర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇల్లందు పట్టణ, మండల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం నిరంకుశ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగం చిరస్మరణీయమన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అబ్దుల్ జబ్బర్, లలిత్‌కుమార్ పాసి, గడ్డి శ్రీను, ఫైనాన్స్ ఇమ్రాన్, తుంగ మహేష్, చాకలి సతీష్, పరకపల్లి రవి, కిషన్ ప్రసాద్ పాసి, జ్వాలా సాంబ, మునుగంటి శివ, దేరంగుల కోరం, ములగండ్ల ఉపేందర్‌రావు, రామ్‌లాల్ పాసి, తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ విద్యార్థి ఉద్యమ రథసారధి ఏఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు గోడపత్రికను కారేపల్లి గిరిప్రసాద్ భవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 28,29,30 తేదీల్లో హనుమకొండలో జరిగే ముగింపు కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నంశెట్టి ఆకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం నుంచి తెలంగాణ ఉద్యమాల వరకు విద్యార్థి పోరాటాల్లో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ దేశానికి అనేక మంది ప్రముఖులను అందించిన చరిత్ర కలిగిన ఘనతని పేర్కొన్నారు.

# ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

-వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం
-చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల్లో కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : సమాజంలోని అసమానతలకు ఎదు రొడ్డి వెట్టిచాకిరికి, దోపిడికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్క రించుకుని శనివారం ఖమ్మం వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసు పత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్ దివాకర టిఎస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా వెను కబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని ఐలమ్మ చిత్ర పటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారన్నారు. జమీందార్ల పాల నలో కొనసాగిన వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు.ఐలమ్మ సామాజిక సేవ కురాలిగా భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్ర పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. నేటి తరానికి ఆమె పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్ బాబా, వెనుకబడిన తరగతుల అభి వృద్ధి శాఖాధికారిణి జి. జ్యోతి, బిసి సంఘం నాయకులు యలగొండ స్వామి, వెంకటరమణ, శ్రీలక్ష్మి, బ్రహ్మయ్య, వేలాద్రి, వెంకటేశ్వర్లు, వీరబాబు, కృష్ణవేణి, నర్సింహారావు, హరిప్రసాద్, సోమరాజు, అప్పా రావు, పుల్లారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వృద్ధురాలి ఇంటి పునరుద్ధరణకు ఎస్సై రామారావు చేయూత





ప్రజాపక్షం/వైరా: శిధిలావస్థకు చేరిన వృద్ధురాలి ఇంటి పునరుద్ధరణకు వైరా ఎస్సై పుష్పాల రామారావు మానవతా దృక్పథంతో చేయూత అందించారు. వైరా నియోజకవర్గంలోని పాలడుగు గ్రామా నికి చెందిన వృద్ధురాలు మోదుగు చుక్కమ్మ ఇంటి పరిస్థితి తెలుసుకున్న ఎస్సై రామారావు సుమారు రూ.20వేలు విలువైన ఇసుక, సిమెంట్, ఇటుకలు వంటి నిర్మాణ సామాగ్రిని అందిం చారు. ఇంటి పరిస్థితి అధ్వానంగా ఉండటంతో విషసర్పాలు, కోతులు, ఎలుకలు, ఇతర క్రిమికీటకాలు ఇంట్లోకి వస్తూ ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని తెలుసుకున్న ఎస్సై స్పందించి అవసరమైన సామాగ్రిని అందించడంతో ఇంటిని మరమ్మత్తు చేసుకున్నట్లు చుక్కమ్మ తెలిపారు. తనకు అండగా నిలిచిన ఎస్సైకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. శనివారం చుక్కమ్మ ఆహ్వానం మేరకు ఆమె ఇంటికి వెళ్లిన ఎస్సై రామారావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయం అందించాలని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచినప్పుడు వారి ముఖాల్లో కనిపించే సంతోషమే నిజమైన తృప్తి అని అన్నారు. ఈ సందర్భంగా చుక్కమ్మ , ఆమె కుమారుడు గోవిందరావు ఎస్సై రామారావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలడుగు సర్పంచ్ గద్దల నర్సింమారావు, గ్రామ పెద్దలు, మోదుగు జానయ్య, జర్నలిస్టులు ఏపూరి రాజారావు, అక్కిశెట్టి రవితేజ, మహేష్, మోదుగు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి




ప్రజాపక్షం/కొణిజర్ల: జమీందారి వ్యవస్థను గుండె ధైర్యంతో ఎదురొడ్డి పోరాడిన వీర వనిత చిట్యాల ఐలమ్మ అని సిపిఐ జిల్లా సమితి సభ్యులు స్వర్ణ రమేష్ కొనియాడారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సంద ర్భంగా కొణిజర్లలోని దొండపాటి భవన్ నందు సిపిఐ ఆధ్వర్యంలో ఆమెకు పూలమాలలు, పుష్పాలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ధైర్యంగా పాల్గొని మహిళా లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఐలమ్మ పేద కుటుంబం కార్మికురాలు అయినప్పటికీ రైతాంగం ఎదు ర్కొంటున్నటువంటి జమీందారి వ్యవస్థను రూపుమాపే దాని కోసం ముందుండి పోరాడిన సాహసరాలిగా పేరు తెచ్చుకుంది రైతాంగ హక్కుల కోసం పోరాడి సంఘటితం చేసిన ప్రజా నాయకురాలని కొని యాడారు. భూమిపై హక్కుల కోసం సామాజిక న్యాయం కోసం సమా నత్వం కోసం పోరాడిన తొలి మహిళా ఉద్యమ నేతల్లో ఐలమ్మ ఒకరు. చాకలి ఐలమ్మ సాహజ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని రైతులు, మహి ళలు కార్మికులు అందరూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకట్టే దాని కోసం ముందుండి పోరాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల గ్రామ నాయకులు తోట పల్లి సీతారాములు, చింతల ఆదిరెడ్డి, అడపా బాబు, ఎర్ర శ్రీను, గుడ్డు గొర్ల రాంబాబు, సోమయ్య, మల్లికార్జున్, గోపయ్య, శ్రీను, వీరేష్, గిరి, నరేస్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లచెరువు ప్రీ ప్రైమరీ పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ

ప్రజాపక్షం కథనానికి స్పందన



విద్యార్థులు లేక వెలవెలబోతున్న తాళ్లచెరువు ప్రీప్రైమరీ పాఠశాల



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : మండల పరిధిలోని తాళ్లచెరువు ప్రీ ప్రైమరీ పాఠశాలలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు ప్రజాపక్షం కథనం ద్వారా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు విద్యార్థుల కోసం ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా విధులు నిర్వహిస్తున్న పరిస్థితిపై ప్రతి కలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన మండల విద్యా శాఖ అధికారి నామవరపు బాబురావు శనివారం తాళ్లచెరువు ప్రీ ప్రైమరీ పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో విద్యా ర్థుల సంఖ్య, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తాళ్ల చెరువు గ్రామంలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున వచ్చే నూతన విద్యా సంవత్సరం నుంచి తాళ్లచెరువు ప్రీ ప్రైమరీ పాఠశాలతో పాటు గోపాలపురం రమణతండా ప్రీ ప్రైమరీ పాఠశాలలను విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పెద్ద గ్రామ పంచాయతీలకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా పాఠ శాలల్లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్ట్రక్టర్, ఆయాలను విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న గ్రామాలకు బదిలీ చేసి అక్కడే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఒకవేళ వారు బదిలీ చేసిన గ్రామాలకు వెళ్లి విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపని పక్షంలో వారి స్థానంలో కొత్త సిబ్బందిని నియమించే అవకాశం ఉందని ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వం ప్రీప్రైమరీ విద్యను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది, వసతులను సద్వి నియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

# ఘనంగా ఐలమ్మ జయంతి



ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు ఆధ్వర్యంలో శని వారం కళాశాల ప్రిన్సిపాల్ లింగంనేని నళినిశ్రీ అధ్యక్షతన చిట్యాల ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ నళినిశ్రీ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో ఒక గొప్ప మహిళా యోధు రాలు ధైర్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా వీరనారి చాకలి ఐలమ్మ నిలిచారన్నారు. చిట్యాల ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో, నిజాం పాలనలో భూస్వాముల పెత్తనం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడారన్నారు. భూస్వాముల పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆమె స్ఫూర్తితో సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# దాతల సాయంతో ఐలమ్మ విగ్రహావిష్కరణ



ప్రజాపక్షం/పెనుబల్లి: తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధురాలు తెలంగాణ నిప్పు రవ్వ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను లంక పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. లంక పల్లి రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా లంకపల్లి గ్రామంలో చిట్యాల ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ, లంకపల్లి రజక సంఘం కమ్యూనిటీ నూతన భవన ప్రారం భోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ మాచి నేని రాజబాబు, మాజీ సర్పంచ్ మువ్వా సరోజిని పాల్గొన్నారు. కీర్తిశేషులు మాచినేని రామకృ ష్ణయ్య, మాచినేని పద్మావతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సర్పంచ్ మాచినేని రాజ బాబు, సోదరులు రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి లక్షల విలువ గల స్థలాన్ని దానం చేశారు. కీర్తిశేషులు సూరటి చైతన్య జ్ఞాపకార్థం భర్త సూరటి కృష్ణారావు చాకలి ఐలమ్మ విగ్రహ దాతగా వ్యవహరించారు. పండితుల వేదమంత్రాలతో గ్రామ సర్పంచ్ మాచినేని రాజబాబు రిబ్బన్ కత్తిరించి కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. అలాగే మువ్వా విజయ్ బాబు తల్లి మాజీ సర్పంచ్ మువ్వా సరోజినీ ఐలమ్మ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. భారీ నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు రెండు లక్షల రూపాయల విరాళంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, లంక పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఘాట్‌లో విద్యుత్ వెలుగులు

పనులను ప్రారంభించిన కౌన్సిలర్ శ్రావణి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డులో ఉన్న వైరా రిజర్వాయర్ బతు కమ్మ ఘాట్ వద్ద నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి లైట్లు అమర్చేందుకు పనులు ప్రారంభమ య్యాయి. నాల్గో వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ ప్రతిపాదనల మేరకు చేపట్టి ఈ పను లను కౌన్సిలర్ వేముల శ్రావణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లా డుతూ బతుకమ్మ ఘాట్‌కు వచ్చే పర్యాటకులు, స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించ డంతో పాటు ఘాట్ పరిసరాలను విద్యుత్ వెలుగులతో నింపేందుకు నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న రిజర్వాయర్ పరిస రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, సుధీర్, మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు, జిల్లా కాంగ్రెస్ మెడికల్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కౌన్సిలర్ ఫణితి సైదులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, ముళ్లపాటి సీతారాములు, శ్యామ్‌బాబు, వీరయ్య, పాలేటి నర్సింహారావు, విద్యుత్‌శాఖ అధికా రులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం



ప్రజాపక్షం/మధిర: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మధిరలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలను, భూమి కోసం, పేదల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్‌కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణగుప్తా, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, సాలిక సురేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన చైర్‌పర్సన్



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 6వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలకు అందుతున్న సేవలు, మౌలిక వసతులు, పోషకాహారాన్ని పరిశీలిం చారు. అంగన్‌వాడీ సిబ్బందిని పిల్లల సంరక్షణ, పోషకాహారం, రోజువారి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరు గైన సేవలు అందేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

# నాటి అమరుల త్యాగాలతోనే స్వేచ్ఛ



**- ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం : సాబీర్ పాషా**

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : నాటి సాయుధ పోరాట అమరుల త్యాగాల పునాదులపైనే నేటి స్వేచ్ఛా తెలంగాణ ఆవిష్కృతమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా స్పష్టం చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దొరలదోపిడీ అణిచివేతపై భూస్వామ్య దోపిడీపై ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తరతరాలకు ఆదర్శప్రాయం అని కొనియాడారు. నాడు కమ్యూనిస్టు పార్టీఅందించిన ఎర్రజెండా అండతోనే సామాన్య మహిళ సైతం తుపాకీ పట్టుకుని నిజాం గుండాలను ఎదురించిందని గుర్తు చేశారు. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు మరుగున పరిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నేటికీ పేదలకు భూమి గూడు అందని ద్రాక్షగానే ఉందని, కార్పొరేట్ శక్తుల దోపిడీ రోజురోజుకూ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాటి అమరుల ఆశయాల సాధనకు పీడిత వర్గాలు మరోసారి పోరాటబాట పట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఐలమ్మ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు నేరెళ్ల రమేష్, బోయిన విజయ్‌కుమార్ ధనరాజ్ అన్నం లక్ష్మీ నారాయణ సుంకర అజిత్ భూస రాజు చింతాల రాజు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో తాగునీటి సమస్యకు పరిష్కారం



**- సాధారణ నిధుల నుండి కేటాయింపు**
**- మేయర్ గణేష్**

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : ప్రభుత్వాస్పత్రిలో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారాం చూపడమే లక్ష్యమని నగర మేయర్ మూడ్ గణేష్ అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.2.50 లక్షల సాధారణ నిధులతో చేపట్టిన నీటి బోరు పనులను శనివారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా బోరు ఏర్పాటు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. విస్తారంగా భూగర్భ జలాలు రావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ జిల్లా నలు మూలల నుండి నిత్యం వందలాది మంది రోగులు వారి సహాయకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వస్తుంటారని తెలిపారు. గత కొద్దిరోజులుగా ఇక్కడ తీవ్ర తాగునీటి యద్దడి ఏర్పడి రోగులు వైద్యులు పారామెడికల్ సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న విషయాన్ని పాలకవర్గం గుర్తించి వెంటనే స్పందించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ సాధారణ నిధుల నుండి కేటాయింపులు చేసి బోరు వేసినట్లు చెప్పారు. ప్రజారోగ్య కేంద్రాల్లో కనీస మౌళిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని భవిష్యత్‌లో కూడా కార్పొరేషన్ పరిధిలోని ప్రజోపయోగ కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఇంజనీరింగ్ సిబ్బంది ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధి, పుష్కరాల పనుల్లో పురోగతి : కలెక్టర్ అంకిత్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలం రామాలయాభివృద్ధి పనులు, పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌కు హాజరైన ఆయన పనుల పురోగతిపై వివరించారు. రోడ్ల అభివృద్ధి ఘాట్ల నిర్మాణం ఆలయాభివృద్ధి పనులతో పాటు భక్తులకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న చర్యలను వివరించారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అవసరమైన భూమిని సంబంధింత శాఖలకు అందుబాటులోనికి తీసుకురావడంతో పాటు టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను ఆలస్యం లేకుండా ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించుకుంటూ అన్ని శాఖల సమన్వయంతో పుష్కరాల పనులను వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు.

# అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులకు స్థల పరిశీలన



ప్రజాపక్షం/మధిర: మధిర పట్టణంలో మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక చొరవతో మంజూరైన అండర్ గ్రౌండ విద్యుత్ కేబుల్ పనులకు సంబంధించిన స్థల సేకరణ, ఇతర ప్రాథమిక పనులను మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ అధికారులు సిబ్బంది, కౌన్సిలరుల పరిశీలించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు, రాయపట్నం సెంటర్ నుంచి మసీదు వరకు, అలాగే రాయపట్నం సెంటర్ నుంచి రైల్వేగేట్ సెంటర్ వరకు, అలాగే రాయపట్నం సెంటర్ నుంచి రైల్వేగేట్ సెంటర్ వరకు అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించారు. పట్టణంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడంతో పాటు రహదారులపై విద్యుత్ వైర్ల సమస్యకు పరిష్కారం చూపేలా ఈ పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కేబుల్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, పనుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడి రామకృష్ణ, ఏఈ వంశీ, మధిర ఏడి అనురాధ, ఏఈ అనిల్ కుమార్, ఎల్ఐ నారాయణతో పాటు కౌన్సిలర్లు, విద్యుత్‌శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయకుడి గుడి హుండీ ఆదాయం రూ.29312లు



ప్రజాపక్షం/మధిర: మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న వినాయకుడి గుడి హుండీని శనివారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.29312లుగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్స్‌పెక్టర్ సమత, ఈవో రామకోటేశ్వరరావు, ఆలయ పూజారుడు హరి, రవిశాస్త్రి, రాయప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

## అన్నదానం మహోన్నతమైన సేవ

ప్రజాపక్షం/పాల్వంచ : పండుగలు, ఉత్సవాలు సమాజంలో మతసామరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. వినాయక చవితి ముగింపు సందర్భంగా చాకలి బజార్‌లో ముత్యాలమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని మేయర్ మూడ్ గణేష్ కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెపుతాయన్నారు.కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి జీవించినపుడే సమాజం శాంతి యుతంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించి ఆదర్శ సమాజ నిర్మాణం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆకలి తీర్చే అన్నదానం ఎంతో మహోన్నతమైన సేవా కార్యక్రమమని, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, వీ. పద్మజ, నిమ్మల రాంబాబు, అశోక్, సాయి, రాజు, అల్లి వెంకటేశ్వర్లు, శ్రీను, రాము, వెంకట్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కార్యకర్తలను విస్మరిస్తే కాంగ్రెస్‌కు నష్టమే



ప్రజాపక్షం/ఇల్లందు: గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక కేసులు, కష్టాలు ఎదుర్కొని పార్టీ కోసం పని చేసిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలను ప్రస్తుత ప్రభుత్వం విస్మరిస్తోందని ఇల్లందు మాజీ మండల అధ్యక్షుడు, జిల్లా నాయకులు పోశం వెంకటేశ్వర్లు ఆరోపించారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన వలస నాయకులకు పదవులు కల్పిస్తూ, సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు కాకుండా వారికి అనుకూలంగా ఉన్నవారికి అందుతున్నాయని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాల్లోనూ అర్హులైన పాత కాంగ్రెస్ కార్యకర్తలు, పేదలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. వలస వాదుల ప్రోత్సాహంతో పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతోందని, కార్యకర్తలను విస్మరించిన పార్టీలు చరిత్రలో బాగుపడలేదన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇకనైనా మేల్కొని సీనియర్ కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.

## ప్రతికూల పరిస్థితుల్లో ప్రసవాలకు పెద్దపీట

**- చర్లలో 24గంటలలో 8 ప్రసవాలు**

ప్రజాపక్షం/చర్ల : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 24 గం.లలో మొత్తం 08 ప్రసవాలు చేశారు. అందులో 04 శస్త్ర చికిత్సద్వారా చేయగా, మరో నాలుగు సాధారణ ప్రసవాలు జరిగాయి. భారీ వర్షాలు రహదార్ల ఇబ్బందుల నడుమ వైద్య బృందం సేవలకు అంతరాయం లేకుండా ప్రసూతి సేవలు అందించారు. కలెక్టర్ అంకిత్ సహకారంతో వైద్యాధికారులు పర్యవేక్షణలో అవసరమైన మందులు పరికరాలు అందుబాటులో ఉంచుతున్నారు. డా. సాయివర్ధన్ పర్యవేక్షణలో గైనకాలజిస్టు డా. శ్రావణి అనస్థీషియన్ డా.కృష్ణప్రసాద్ నర్సింగ్ సిబ్బంది సమిష్టి కృషితో సేవలు కొనసాగుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో 24గం.ల వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ప్రజల్లో ప్రభుత్వాస్పత్రిపై నమ్మకం కలుగుతోంది.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

ప్రజాపక్షం/ముదిగొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీఓ విజయతోపాటు సిబ్బంది ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర ఎంతో కీలకమని, భూస్వామ్య దోపిడికి, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని గుర్తు చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులను గౌరవిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

## ముదిగొండ-వల్లభి రహదారి విస్తరణకు కసరత్తు



ప్రజాపక్షం/ముదిగొండ: ముదిగొండ కేంద్రం నుంచి వల్లభి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని రెండు లైన్ల నుంచి నాలుగు లైన్లుగా విస్తరించే పనుల్లో భాగంగా రహదారికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు విద్యుత్, రహదారి, భవనాల శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి, రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్‌స్తంభాలను గుర్తించి వాటిని మార్చాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు అవసరమైన కొత్త స్తంభాలు, టవర్లకు సంబంధించి మార్కింగ్ చేశారు. ఈ సంయుక్త తనిఖీలో ఖమ్మం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్అండ్‌బీ డీఈ భగవాన్, ముదిగొండ ఏడీఈ రమ్య, ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రహదారి నిర్మాణ పనుల కాంట్రాక్టర్ వేజెండ్ల సురేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చిరామయ్య, విద్యుత్, ఆర్అండ్‌బీ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యసౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడు గ్రామంలో స్థానిక శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో 130మంది కంటి పరీక్షలు చేపించుకున్నారు. అవసరమైన వారికి మందులు అందించడంతో పాటు శస్త్ర చికిత్సకు అవసరమైన వారిని తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నరేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్యాంకర్లలో పామాయిల్ దొంగతనం

**-రెండేళ్లుగా సాగుతున్న దందా**
**-పలువురు నిందితులు అరెస్టు : ఏసిపి రమణమూర్తి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గుట్టుచప్పుడు కాకుండా ట్యాంకర్లలో పామాయిల్ దొంగతనం చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. గత రెండేళ్లుగా కోదాడకు చెందిన ఓ వ్యాపారి ట్యాంకర్ల నుంచి పామాయిల్ తీసి ఇతరులకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని దీనికి సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు ఏసిపి రమణమూర్తి తెలిపారు. శనివారం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చింతలపూడి మండలం సీతానగరంలోని గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి పామాయిల్‌ను ట్యాంకర్‌లో లోడు చేసుకుని హైదరాబాద్‌లోని కాటేదాన్‌కు తరలించే వారు. మార్గ మధ్యలో తూకాల్లో తేడా రాకుండా డ్రైవర్ల ద్వారా ట్యాంకర్ల నుంచి పామాయిల్ తీస్తున్నట్లు గుర్తించామన్నారు. కోదాడకు చెందిన ఆయిల్ వ్యాపారి సిహెచ్ కనకయ్య డ్రైవర్లకు డబ్బులు ఇచ్చి పామాయిల్ తీస్తున్నట్లు గుర్తించామన్నారు. అతని ఫోన్ పే ద్వారా రెండేళ్లుగా డ్రైవర్లకు రూ.9.30 లక్షలు నగదు చెల్లించినట్లు విచారణలో తేలిందన్నారు. ఈనెల 22న రాత్రి సమయంలో నగర సమీపంలో ట్యాంకర్‌లోని పామాయిల్‌ను తీస్తుండగా సమాచారం మేరకు ఖానాపురం హవేలీ పోలీసులు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్యాంకర్ యజమాని, డ్రైవర్ అయినా షేక్ కమరుద్దీన్, ఆటో యజమాని కం డ్రైవర్ గోపీనాథ్, వ్యాపారికి సంబంధించిన ఉద్యోగి దారా శ్రీనివాస్ లను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. కోదాడకు చెందిన వ్యాపారి గోద్రెజ్ కంపెనీలో లారీ బయలు దేరిన తర్వాత నగర సమీప ప్రాంతాల్లో అట్టి లారీల నుంచి పామాయిల్‌ను దొంగతనం చేస్తూ కోదాడ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ చోరీకి సంబంధించి కంపెనీకి సంబంధించిన వ్యక్తులు ఉన్నారా వంటి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ వ్యాపారితో పాటు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మరో ఎనిమిది మంది నిందితులను గుర్తించామని వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. ఆయిల్ ట్యాంకర్‌ను, ఆటోను, 31 ఆయిల్ క్యాన్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ. 1000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. కంపెనీ మేనేజర్ రాంచందర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ భానుప్రకాష్, ఎస్ఐ రాజారావు తదితరులు ఉన్నారు.

## నేడు చింతకానిలో భట్టి పర్యటన



**ప్రజాపక్షం/ చింతకాని :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్‌లో బయలుదేరి పందిళ్లపల్లి చేరుకుంటారని అక్కడ అధికారులతో ఆయన సమావేశం కానున్నారు. పందిళ్లపల్లి నుంచి అనంతసాగర్, చింతకాని వరకు బిటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. పందిళ్లపల్లి, మత్కేపల్లి పంచాయతీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. నర్సింహాపురం ఎస్సి కాలనీలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. పర్యాటక అభివృద్ధికి సంబంధించి శంకుస్థాపన చేసిన అనంతరం చెన్నకేశవ స్వామిని దర్శించుకుంటారు. చింతకానిలో బిఎల్‌ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

## చాకలి ఐలమ్మకు నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వీరనారి ఐలమ్మ జయంతి సందర్భంగా బిఆర్‌ఎస్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శనివారం ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పగడాల నాగరాజు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి, ధైర్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. భూమి హక్కులు, ఆత్మ గౌరవం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నాటి కృష్ణ, మేకల సుగుణారావు, షకీనా, పాషా, శ్రీను, లింగరాజు, సురేష్, కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల పట్ల వివేకానంద యాజమాన్యం దురుసు ప్రవర్తన

**ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం :** ఫీజుల చెల్లింపు విషయంలో మామిళ్లగూడెంలోని శ్రీ వివేకానంద విద్యాలయం దురుసుగా ప్రవర్తిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఫీజుల చెల్లింపు విషయంలో నిబంధనలను పక్కనపెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నారని విద్యార్థులను సైతం ఇబ్బందులు పెడుతున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీజుల విషయంపై మాట్లాడేందుకు శనివారం వెళ్లిన విద్యార్థి తండ్రిపై దాడి చేసేందుకు ప్రయత్నం చేశారని పోలీస్ కేసులు పెడతామంటూ బెదిరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బయటకు తెలిస్తే విద్యార్థులను ఇబ్బందులు పెడతారని మౌనంగా భరిస్తున్నామని నా వృత్తిని సైతం కించపరిచేవిధంగా మాట్లాడారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది విద్యార్థుల ఎదుట ఇష్టానుసారంగా మాట్లాడడంతో పాటు వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని ఈ విషయమై విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కొద్ది రోజులు ఫీజు చెల్లింపు ఆలస్యమైనందుకు హాల్ టికెట్ నిలిపి వేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల విషయంలో విద్యాశాఖాధికారులు జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి





**ప్రజాపక్షం/తల్లాడ :** ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు అన్నారు. తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందన్నారు. ఆమె ధైర్య సాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్‌రాజు, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, విడిసి ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, వార్డు మెంబర్స్ శ్రీనివాసరాజు, దినేష్‌కమల్, పాషా, సీనియర్ జర్నలిస్టు అప్పిరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయంలో :**
తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యానికి, ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల కోసం, పేదల భూమి కోసం అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తల్లాడ తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సైలను కలిసిన ఎంఆర్‌పిఎస్, ఎంఎస్పీ నూతన కమిటీ

**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలంలో నూతనంగా ఎన్నికైన ఎంఆర్‌పిఎస్, ఎంఎస్పీ కమిటీ సభ్యులు శనివారం తహశీల్దార్, సిఐ, ఎస్సైలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం జాతీయ, రాష్ట్ర కమిటీలు ఇచ్చే పిలుపులను విజయవంతం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడిగా కంచర్ల బాలకృష్ణమాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా కంచర్ల చందు మాదిగ, మండల అధికార ప్రతినిధిగా మడుపల్లి నాగేశ్వరరావు, ఎంఎస్పీ ప్రధాన కార్యదర్శిగా కారుమంచి సత్యం మాదిగతో పాటు నారపోవు కిరణ్‌కుమార్ మాదిగ, నారపోవు తిరుమలరావు మాదిగ, సైదులు మాదిగ తదితరులు నూతన కమిటీలో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వచ్చే నెలా7న అమరావతిలో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని నూతన కమిటీలు తీర్మానించాయి. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు పూర్ణకంటి రామారావు మాదిగ, కారుమంచి వెంకన్న మాదిగ, అయినాల కనకరత్నం మాదిగ, మాగంటి బాబు మాదిగ, కంచర్ల వెంకటేశ్వర్లు, కన్నెగంటి హుస్సేన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడలోని దొడ్డ కృష్ణయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం పులి కృష్ణయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్ పాల్గొని మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ప్రభుత్వ విధానాలపై నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే రైతు సంఘం జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తారన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, మోహన్‌రావు, కృష్ణయ్య, నరేష్, నాగేశ్వరరావు, రామిరెడ్డి, నర్సయ్య, శ్రీనివాసరావు, లత, కృష్ణయ్య, ఆనందరావు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



**ప్రజాపక్షం/మధిరః** ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం ఆకాంక్షించారు. మధిర మున్సిపాలిటీలోని 18వ వార్డు లడకబజార్‌లో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం మాట్లాడుతూ బాలగణేష్ యూత్ వారు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. 13వ రోజు వినాయక విగ్రహం వద్ద వినాయక ఉత్సవ విగ్రహానికి అబిషేకాలు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర కోటేశ్వరరావు, మట్టూరి రాజా, చేబ్రోలు భాస్కర్‌రావు, కూరపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కమాన్‌బజార్ రైల్వే గేటు సమీపంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ శోభాయాత్రను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూర్వాభద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణ, భక్త బృందం సభ్యులు ఆనంద్‌కుమార్, శ్రవణ్, రవి కిరణ్, టిఎస్ చక్రవర్తి, సిద్దంశెట్టి శ్రీకాంత్, కోదుమూరు భద్రయ్య, ఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

## చేయూత లబ్దిదారుల ఇండ్ల తనిఖీ



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామ పంచాయతీని శనివారం అదనపు కలెక్టర్ శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేయూత పథకం నూతన లబ్దిదారుల క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఆమె మహిళా లబ్దిదారుని ఇంటికి నేరుగా వెళ్లి పెన్షన్ అర్హత ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీధర్‌రాజు, వెరిఫికేషన్ ఆఫీసర్ ఎండి తాజుద్దీన్, చేయూత పింఛన్ నూతన దరఖాస్తుదారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పర్ణశాల పండుగ మహోత్సవం



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలం కలకొడిమ గ్రామంలో దేవుని సంఘం (ఏడవ దినము) ప్రార్థన మందిరంలో పర్ణశాలల పండుగ మహోత్సవ ప్రారంభ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఆదూరి ఆనందం ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగ వేడుకలో దేవుని వ్యాక్యాన్ని బోధించారు. 2వేల సంవత్సరాల క్రితం పాపులను రక్షించుటకు ఏసుక్రీస్తు ఈ లోకంలో శరీరదారిగా వచ్చాడని, మన పాపాల కొరకు సిలువలో తన ప్రాణాలు పెట్టాడని ఆయన తిరిగి రానున్నారన్నారు. ఈ వేడుకల్లో ముద్దునూరు, గన్నవరం, కిష్టాపురం గ్రామాల సేవకులు ప్రకాషరావు, కృష్ణ, అనిల్‌కుమార్, వివిధ గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.